ఆరోజు ఆదివారం కాదుగానీ ఎవరో చచ్చిపోతూ మాకో సెలవిచ్చిపోయారు. అలా పోయినా యన మా వార్డెన్ ఫేవరెట్ పొలిటికల్ ఫిగర్ (లోకల్ గా). అందుకని ఆవిడ వీలైనంత విషాదంగా కనిపిస్తూ ఓసారి కిచెన్‌కు వెళ్ళి "సీ మిస్టర్ కుక్ ! నేనీరోజుకు పండ్లూ పాలతో సరిపెట్టుకుంటానుగానీ, పదకొండు తరవాత అవి నా రూమ్‌కి పంపేయి" అనేసి మందగమనంతో మా ముందునుంచే నడుస్తూ పోబోయారు.

అప్పుడు మేము వరండాలో నిలబడున్నాం. నేను అందర్నీ చేతులు కట్టుకొమ్మన్నాను. వాళ్ళు కట్టుకున్నారు. కొందరు విషాద సూచకంగా ఇంకాస్త వినయపూర్వకంగా తలలు కూడా వంచారు.

మేడమ్ కొంచెం దూరం అదే స్పీడ్‌తో వెళ్ళి, ఏమనుకున్నారో మా దగ్గరికి వచ్చి, "చూడండమ్మా, ఈ ఒక్కరోజుకూ మీరే గొడవా చెయ్యకండేం! సినిమాలంటూ నా దగ్గరకు పర్మిషన్‌కని రావద్దు. నాకసలు మనసేం బాలేదు. ఈ పూటకు సైలెంట్‌గా ఏదైనా చదువుకోండి. ప్లీజ్! ఇది నా రిక్వెస్ట్ అనుకోండి" అనేసి వెళ్ళిపోయారు. అది మాకు చాలా ఆశ్చర్యం. అసలు క్రమం మరోలా వుంటుంది. ఆమె తిడుతూ మమ్మల్ని సంబోధిస్తే తప్ప మాకు అసంతృప్తిగా వుంటుంది.

"సుందరీబాయిగారు నాంచారయ్యగారిని పూర్వాశ్రమంలో ప్రేమించారు. ఈ రోజు వరకు మనకు తెలియని సత్యమిది. అయ్యారే! ఎంతటి ప్రేమే అది!" కవిత చేతులు నెత్తిమీద పెట్టుకొని చెప్పింది. నాంచారయ్య చనిపోయిన శాల్తీ అయితే సుందరీబాయి మా వార్డెన్. దాన్ని తోసుకుంటూ నేను రూమ్ లోపలికి పరుగెత్తాను. అందరూ జెట్ స్పీడ్‌తో వచ్చి వాల్చి వున్న మూడు మంచాలపై పడ్డారు. వున్నట్టుండి గావుకేక పెట్టింది శాంతి. అనుకుంటూ వున్నదే. అందుకే మొహం గోడ వైపుకు తిప్పి నిశ్శబ్దంగా పడుకున్నాను. అందులో రెండు మంచాలు దానివి. నేను మా ఇంటి నించి తెచ్చుకున్న సోఫాలో పడ్డాను ప్రస్తుతం! "మీ కసలు మేనర్స్ తెలుసా! మీలో ఏ ఒక్కరూ యాభై కేజీలకు తక్కువ వుండరు. అంత ఫోర్స్‌తో వచ్చి పడితే ఆ బరువు నూరు కేజీలకు సమానం.



# మనం మారాలి(?)

సర్వేపల్లి అపర్ణ

ఆ మంచాలేమవాలి? అసలా ఫోమ్‌కుండే స్ప్రింగ్ యాక్షన్ ఏమైపోవాలి?" అదీ దాని ఏడుపు. కానీ వినేవాళ్ళేరి? అందుకే అది అర్జంట్‌గా అలిగింది. కొంచెం సేపటి దాకా నేనూ పట్టించుకోలేదు. వాళ్ళు కూడా చూడనట్లే వున్నారు. ఎవరిదో నెయిల్ పాలిష్ బాటిల్ కిటికీలోంచి బయటకెళ్ళి పోయేదాకా!

ఈసారి కేక సుధది. "పాపాత్మురాలా! వచ్చే జన్మలో చైనాలో పుడతావే!" మంచం మీద నుంచి దూకింది. "మెరూన్ కలర్ టిప్స్ ఎండ్ టోస్. తపస్‌చేసి సంపాదించుకున్నానే స్టుపిడ్" అంటూనే బయటికి పరుగెత్తింది బాటిల్ కోసం.

శాంతి రుసరుసలు మాత్రం తగ్గలేదు. "బుద్ధం శరణం గచ్ఛామి! ముందు మనం మన రూంలోనే శాంతిని పొందలేకపోతే ప్రపంచ శాంతిని ఎలా పొందగలం! శాంతీ! శాంతించవే! హాస్టల్ సౌభాగ్యం కోసం" గీత పద్మాసనం వేసుకొని చెప్తోంది. "కావాలంటే రాత్రికి నేనీనకు మూడు కథలు చెప్తాను."

లాభంలేదు. తర్వాత సబిత ఉద్బోధ మొదలైంది.

"ఏమైనా నువ్వు మాత్రం శాంతించి తీరాలి బేబీ! తప్పదు. లేపోతే పావురాన్ని గుర్తుతెచ్చుకో! అది బీ అయితే నెహ్రూ షర్ట్‌కుండే గులాబి పువ్వును."

ఈసారి దిండ్లు గాల్లోకెగిరాయి "అవి దానివేనేవ్!"

"నేను మాత్రం ఎలాంటి పిక్నిక్‌కూ రాబోవట్లేదు" కళ్ళు మూసుకుంటూ అన్నాను.

"నేను వచ్చినా పట్టుచీర కట్టుకొని వస్తాను. అది ఖాయం" అంతవరకూ సైలెంట్‌గా వున్న రాగిణి తేల్చేసింది.

అంతే! లేచి కూర్చుంది శాంతి. "బిందూ! ఎందుకే అంత కచ్చ! నేను నిన్నేమన్లేదు. నువ్వు నీ సోఫామీదే పడుకున్నావ్. అసలు నీ మంచం తొక్కినందుకు కూడా నాకోప్రప మొచ్చింది!"

"ఎంత వినయం!! అబ్బ! అమ్మ!" గీత మూలిగింది.

అక్కడే కూర్చుని గోళ్ళ రంగు పెట్టుకుంటూంది!

కిటికీలోంచి బయటికి చూశాను. ఎండ లేకుండా, మబ్బు పట్టి చల్లగా వుంది వెదర్. చెట్లమీద పక్షులు కూడా నిశ్శబ్దంగా వున్నాయి.


గీత కూడా అటే చూస్తూ పడుకుంటూ అడిగింది. "పార్వతి డేట్ ఆఫ్ బర్త్ ఎవరికి తెల్సే?...." "దేవదాసుకి" - ఇన్ఫర్మేషన్ ఇచ్చేసి వార్డెన్ దగ్గర కెళ్ళిపోయింది రాగిణి. "షటప్! ఏ కుంకదా రిప్లై? పారూ మేరేజ్ డే కూడా అదే! గ్రీటింగ్స్ పంపించాలి. చెప్పండే!"

"నీ కలాంటి వివరాలేవి కావాలన్నా నా డైరీలో వుంటాయి. వెళ్ళి చూసుకో!" గంభీరంగా అనేసింది సబీ!

"అదెక్కడుంది?"

"చెప్తున్నాను! ఇప్పుడు నువ్వు యాభై గజాల దూరంలో వుండే నా రూమ్‌కు వెళ్తావుకదా! ముందు తలుపులు తెరిచి లోపల లైటేస్తావ్."

"ఇది పగలు కాదా?"



"ఇంకెవరూ లేరూ!" "ఏమిటీ?" "గుర్తు తెచ్చుకునేందుకు!"

ఇంతలో సబిత అరుపు "సుధా ఈజ్ మిస్సింగ్! ఇంకో రెండు నిమిషాల్లో మన మందరం దాన్ని వెతకటానికి వెళ్తాం!"

"రాగీ! ఇంక రెండే రెండు బొట్లు మిగిలాయి సీసాలో! కావాలంటే నీ చిటికెన వేలికి పెడ్తారా!" వరండాలోంచి ఒక కేక రూమ్‌లోకి వచ్చింది. అది సుధది. అది

"పగలే కానీ కిటికీ తలుపులు మూస్తే మా రూమ్‌లో రాత్రౌతుంది."

"అయ్యయ్యో! రాత్రిందివళ్ళు అంత సులభంగా ఏర్పడతాయటే? చిన్నప్పుడు నాకింకేదో చెప్పారు" శాంతి మహా దిగులు పడింది

"సబీ తర్వాత...."

"అక్కడ కనిపించే పెట్టెల్లో రెండు రాగివి కదా!"

"ఆ మిగిలినవి ఏ లోహంతో చెయ్యబడ్డాయి!" శాంతి ప్రశ్న కమ్ ఆశ్చర్యం.

"నువు నోర్ముయ్! గీతా! వింటున్నావా?"

"ఆఁ" అంటద.

"నా సూట్‌కేసుల్లో సఫారీని మాత్రం నువ్వు చిన్న పాపను దించినట్లు దించుతావ్. దానికింద మరో విఐపి. తెరిస్తే లోపల ఒక వెండి బాక్స్ వుంటుంది. మా అమ్మమ్మదిలే! నాకిచ్చేసింది. అందులో ఒక గోల్డెన్ కలర్ ప్లాస్టిక్ కవర్. మా వదిన పట్టుచీరలది. దాన్లో వుంటుంది డైరీ. అందులో అక్టోబర్ ట్వంటీ సెకండ్‌న పార్వతి వెడ్డింగ్ గురించి కొంచెం రాసుంటుంది. అది మాత్రమే నువ్వు చదువు. మిగతా పేజీలేవైనా తిప్పిన క్షణంలో గుండె ఆగి ఛస్తావ్."

"ఒసేయ్! అవి ఇక్కడే వచ్చిపోయింది." శాంతి గాభరా

"ఒద్దులేవే సబీ! ఇప్పుడా డేట్ తెలిస్తే కాని నేనేం చెయ్యాలి? ఇంట్రెస్ట్ పోయింది"

అంతా విని పెద్దగా నవ్వాను. "గీతా! సబీ ఆ డేట్ చెప్పేసిందే" అని అరిచింది శాంతి. ఇప్పుడు వెలిగిందా ట్యూబ్‌లైట్! రెండున్నర క్షణాలేమున్నా ప్రశాంతంగా వుందేమో! టోర్నడోలాగా లోపలికి వచ్చింది రాగిణి అరుచుకుంటూ. "గ్రేండ్ సక్సెస్! హర్డెస్ ఇంత విషాదంలో కూడా మనల్ని సహృదయతతో అర్థంచేసుకున్నారు. మనమామెకి ఋణపడివున్నాం."

"ఎంత?"

"రేపు మనం ఎంజాయ్ చేసినంత!"

"సుధేదే?"

"వరండా నుంచే మార్కెట్ కెళ్ళింది! మూడు వేళ్ళకే చాలిందట పాలిష్! మిగతా రెండు వేళ్ళూ రేపు కట్టబోయే చీరకు మేచ్ అవవని ఏడ్చింది. ఓదార్చి బజారుకు పంపించాను" -ఇలా గొడవ చేస్తూనే వున్నాం.

"నేనో గంట నిద్రపోనా?" అన్నాను మర్యాదగా.

"పోనా ఏంటమ్మా? శుభ్రంగా పో. కానీ నేను కళ్ళు మూసుకుంటున్నాను. మీ నోళ్ళు ముయ్యండి అంటే మాత్రం కుదరదు. నోట్ ఇట్!" కవి మహా విసుగ్గా అంది.

దానికి వారానికొకరోజు నిద్రపోవడం అలవాటు. ఆదమరచి నిద్రపోయే వాళ్ళను చూస్తే ఇలాగే ఏడుస్తుంది ఇన్‌డైరెక్ట్‌గా. నవ్వుకుంటూ కళ్ళు మూసుకున్నాను. వాళ్ళు కార్డ్స్ ముందేసుకొని కూర్చున్నారు.

సాయంత్రం ఆరుకు అందరూ పిక్నిక్ సరంజామా సర్దుతుంటే మెలకువ వచ్చింది.

"గుడ్ ఈవినింగ్" చెప్పి టీ ఇచ్చింది కవిత

"అందరూ చాలా బిజీ కదూ!"నవ్వాను.

"ఒకసారి ఏడవటం కూడా అయింది" సబిత వైపు చూస్తూ అంది కవి.

"మనకు మామూలేగా! నవ్వినన్నిసార్లు ఏడవకపోతే అది బ్రతకలేదు. ఇంతకూ ఇప్పటి ఏడుపు దేనికి?" సబీ అప్పటికే నా బెడ్ దగ్గరగా వచ్చి నిల్చుంది. చేతిలో లెటర్ వుంది.

"ఏమైంది?" అన్నాను లాగి మంచం మీద కూర్చోబెడుతూ

"నేనేం చెప్పాలి తనకు? కమల్ వద్దను కొని నేను బతకలేనే! అసలు బతకను. అది ఫస్ట్ పాయింట్. కానీ మా మమ్మీ చాలా హార్ష్‌గా లెటర్ రాసింది...." ఆపేసింది నేనూ మౌనంగా వుండిపోయాను కొన్ని క్షణాలు.

"బిందూ! నువ్వేం మాట్లాడట్లేదు."

"ప్రాక్టికల్లీ స్పీకింగ్ హి వోంట్ డిజర్వ్ యు ఎక్సెప్ట్ ఫర్ ది ఫాక్ట్ దట్ యూ లవ్ హిమ్!" నెమ్మదిగా అన్నాను. లేచి నిల్చుంది సబీ. అప్పటికే వెక్కిళ్ళు వినిపిస్తున్నాయి గొంతులో.

"నువ్వెప్పుడైనా అతని ముందు ఇలాగే ఏడ్చావా?" అన్నాను.

"నెవర్! అతనేడవాల్సిందే, దీనితో ఫ్యూచర్ తల్చుకుని" కవి అరిచింది.

ఆ మాటలకే నవ్వేసింది సబిత. కేవలం అతని ఊహకే అంత సంతోషపడిపోయేది- అతనెప్పటికీ లేకుండా బ్రతకమంటే.... ఇంపాజిబుల్!

"రిజిస్టర్డ్ మేరేజ్ కయితే రెండు నెలలైనా పడుతుంది తెల్సా" తల ఊపింది.

"తాళి బొట్టు కట్టించుకుంటాను ఏ గుళ్ళోనో! ఆ ఫొటోలు చూపిస్తే అప్పటికప్పుడే పెళ్ళి లీగల్‌గా కూడా...."

పెద్దగా నవ్వింది సుధ. "రెడీమేడ్ ఇన్ఫర్మేషనేవ్! నిద్రలో కూడా అక్షరం తప్పకుండా చెప్పేట్లుంది."

"కానీ ఈ చుట్టుపక్కల మీ డాడీ ఇన్‌ఫ్లూయెన్స్ ఎక్కువ. ఇంకెక్కడికైనా వెళ్ళి చేసుకోవాల్సిందే మీరు."

"మద్రాస్ అనుకున్నాం. మంచిదేనా?!"

"బై ఆల్ మీన్స్! విష్ యూ ఆల్ సక్సెస్" అని నవ్వాను.

"మీ రెవరూ రారా?"


"ఏం? మీ కమల్‌కు ఫ్రెండ్సెవరూ లేరా?"


"అది నా కనవసరం. నా తరపున ముఖ్యంగా బిందూ నువ్వు...."

"కానీ అంతా ప్లేన్డ్‌గా జరగాలి. ఒక్కసారే అందరం మాయమైతే మీ డాడీ...."

"ఔనౌను! వద్దులే" తడబడింది. దాని మనసులో ఎవరూ లేనట్లు బ్రతకాల్సిన రోజు గుర్తొచ్చి వుండాలి. తప్పదు! ఇప్పటి నుండే ఒంటరితనం అలవాటు చెయ్యాలని నా తపన. రాగిణి అంది నాతో. "బిందూ! పెళ్ళి తర్వాత కూడా అంత ప్రశాంతంగా వీళ్ళను బ్రతకనివ్వరేమో!"

"కెనడా వెళ్ళిపోవాలని వాళ్ళ ప్లాన్. ఇదంతా ఇంజనీర్‌గారి ఐడియాలే! లేకపోతే ఈ మొహానికేం వచ్చు! నవ్వి వెంటనే ఏడవడం తప్ప." సబిత మళ్ళీ నవ్వింది. మరో గంటసేపు ఆ విషయాలే మాట్లాడుకున్నాం. ఇంకో వారం రోజుల్లో మా సబితను ఎవరో ఒక కమల్ భార్యగా చెప్పుకోవాలి అన్న ఊహ మాకు నచ్చీ నచ్చనట్లు వుంది. ఆ టైమ్‌కు దాని స్వీట్ హార్ట్ అవుటాఫ్ స్టేషన్ అవబట్టి సరిపోయింది. లేకపోతే.... అనుకొని నవ్వుకున్నాం.






మరో పది నిమిషాల తర్వాత సబీ. రాగిణి తన రూమ్‌కి బయల్దేరారు. శాంతి ఈ రోజెందుకో అక్కడ పడుకుంటానంది. గీత మా రూమ్‌లోనే వుండిపోయింది. ఇంకొంచెం సేపయాక సుధ కూడా "బై" చెప్పేసి ఇంటికి వెళ్ళిపోయింది.

నేను, గీతా, కవీ మిగిలాం! మా అందర్లోకీ గీతకు నిద్రెక్కువ.

ఒకరకంగా చెప్పాలంటే దాని నిద్రకు హిస్టారిక్ ఇంపార్టెన్స్ వుంది.

అదెలాగంటే, దాని నిద్రమీద ఈరోజు పుట్టిన ఏ జోకూ మర్నాటికి పాతబడిపోకుండా ఉండలేదు. కొన్నాళ్ళు అలాగే జోకులేశాం! ఇప్పుడు మాత్రం నిర్లిప్తంగా దాని నిద్రనూ, ఆ నిద్రకు గల ప్రత్యేకతనూ చూస్తూ ఊరుకుండిపోతాం! ఇప్పుడూ అంతే! కూర్చున్నది మొదలు ఆవలిస్తూనే ఉంటది. ముందు ఒళ్ళుమండినా ఆ తర్వాత జాలిపడి నిద్రపొమ్మన్నాం. మంచం ఎక్కబోయేముందు ఒకసారి సబీ వాళ్ళ రూమ్‌కు వెళ్ళి రేపు తొమ్మిదికల్లా పిక్నిక్‌కు రెడీ అవాలని చెప్పి వచ్చింది. వాళ్ళు పూర్తిగా వినకుండానే తరిమినట్లున్నారు దాన్ని. సైలెంట్‌గా తలుపులు మూసివచ్చి పడుకుంది-మరో అయిదునిమిషాల్లో నిద్ర.

నా వైపు చూస్తూ "నిద్ర రావట్లేదా!" అంది కవి.

లేదన్నాను.

"నేను నీతో ఏదైనా కొంచెం మాట్లా...ప్పు!" అంది.

అర్థంకాలేదు. "అంటే!" అన్నాను.

ఏం చెప్పలేదుకానీ అక్కడినుంచి వెళ్ళిపోయింది. వస్తూ రెండు ప్లేట్లలో చిప్స్ పెట్టుకుని తెచ్చింది. ఒక ప్లేట్ నేను తీసుకున్నాను.

"ఈ రోజు పౌర్ణమి బిందూ! నీకిష్టమైన రోజు!" అంది.

"నో! మన హాస్టల్ కాంపస్‌లో కురిసే వెన్నెల కాదు నాకిష్టం. కాష్మీర్ ఫ్లవర్ వేలీస్‌మీద జారుతున్నట్లు పడుతుందే.... అదంటే...."

"అదెలా ఉంటుంది!"

"ఉల్లి పొరలు కట్టినట్లు. కొంచెం గట్టిగా గాలివీస్తే ఆ తెరలు కదిలిపోతున్నట్లు. నిజంగా అలా అనిపిస్తుంది నాకు."

నవ్వింది కవి. "నా పేరు నీకు పెట్టాల్సింది. లైటాఫ్ చేసేస్తున్నాను." నేను "ఊఁ" అనక ముందే లైటారిపోయింది. కిటికీలోంచి వెన్నెల వైపు చూశాను. చీకటికంటే బాగుంది. మరో నిమిషం చూశాను. బెడ్‌లైట్ వెలిగింది రూమ్‌లో! ఇప్పుడు రెండుచోట్లా గుడ్డి వెలుతురే! ఏదీ అందంగా లేదు. కళ్ళు మూసుకున్నాను.

అప్పుడే వినిపించాయి కవి మాటలు "నేనూ అలాంటి మిడిల్ క్లాస్‌లో పుట్టుంటే బాగుండేది ఇప్పుడు ఇంత స్టేటస్ ఉండి నాకేం చేసోంది!" గీత వైపు చూస్తూ అంది. మిడిల్‌క్లాస్ వాళ్ళంతా ఆదమరిచి నిద్రపోతారని దాని నమ్మకమేమో! కానీ మనసు తేలికా బరువు కానట్లుగా అదోలా వున్నప్పుడుఅంది కవి ఆమాటలు. అందుకే అనవసరంగా రెచ్చిపోయాను దానిమీద.

"కడుపునిండాక తియ్యగా మాటలు చెప్పడం కష్టంకాదు బేబీ! డిగ్రీ పూర్తయిన వెంటనే ఉద్యోగం వెతుక్కోవాలి. అది ఎన్నేళ్ళలా గానుగెద్దులా బ్రతుకుతుందో దానికే తెలియదు. వాళ్ళ అన్నయ్య సూయిసైడ్ వలన వచ్చిన ఇన్‌ఫేమీ ఎవరూ మర్చిపోరు! అతని తప్పుకు ఇది పే చేస్తుంది"

ఉంగై పోయింది కవిత. "నేను జోక్‌గా అన్లేదు బిందూ! దానికి ఒక ఎయిమ్ అంటూ ఉంది. మరి నాకో" ముఖంలోకి చూస్తూ అడిగింది.

"ఏం లేకున్నా నువ్వు బతకగలవ్! ఎట్‌లీస్ట్ బ్రతకనిస్తారు. కానీ అదలా కాదే! రేపేమిటో ఆలోచించకుండా బతుకు కాదు. గీతా, రాగిణీ వాళ్ళు మనతో కలిసి నవ్వగలుగుతున్నారు. అందుకు నేనెప్పుడూ ఆశ్చర్యపోతాను."

చిన్నగా నవ్వింది కవిత. "నా ఫ్యూచర్ నువ్వు చెప్పినంత బాగుండదు బిందూ!! బావను చేసుకుంటే నరేగానీ లేకుంటే ఏముంది!"

"ఎందుకు చేసుకోవు! అసలేమిటి నువ్వనేది!"

"ఏమిలేదు! జస్ట్ నథింగ్" కావాలనే తుంచేసింది.

"వర్జిన్ దేరీజ్ సమ్‌థింగ్. అయామ్ విల్ టు ఫీల్ దట్!"

"ఎన్ననుకున్నా నీకంటే అదృష్టవంతులమే! నీ సానుభూతికావాలనుకునేంత దౌర్భాగ్యంలో లేముకదా!" దాని గొంతు వణికింది ఆ మాటలన్నప్పుడు.

ఆ కవనంతా తెచ్చిపెట్టుకున్న దేవాగురించి నాకూ, వాళ్ళకూ అంతా తెలుసు. ఒకరకంగా చూస్తే అదమ్మదే నిజం! నాతో వాళ్ళ బాధలు పంచుకోవడం అర్థం లేని విషయం!అయినా నామోహంచూసి ఇంకేమీ అడక్కముందే తనే అంది.

"ఆనంద్ మారిపోయాడేమో అనిపిస్తోంది...."

"అనిపించటమేగా!" ఒళ్ళు మండి దుప్పటి మెడవరకూ లాక్కున్నాను కళ్ళు మూసుకుంటూ. వెంటనే లాగేసిందిదుప్పటి. "అనుకోవటం కాదే! నిజంగానే మనసు మార్చుకున్నాడు"

చాలా పెద్ద షాక్ ఆ మాటలు వినాల్సి రావడం "ఇదేనా నువ్వు చెప్తానన్న లేట్ న్యూస్!"

తల ఊపింది నా చేతి వేళ్ళు పట్టుకొని చూస్తూ. లేచి కూర్చున్నాను. "అంటి వాళ్ళకు తెల్సా" ఒక దిక్కుమాలిన ప్రశ్న. నాదే!

"లక్షణంగా! మా నాన్న గుండెలు బాదుకొని ఇప్పుడే అతన్ని అమెరికా నుంచి ఈడ్చుకొస్తానన్నారు. అమ్మ ఒప్పుకోలేదు. నేనూ వద్దన్నాను. దేబిరించాల్సిన అవసరం నాకేంటి! మామమ్మీ దగ్గరే ఉంటూ సోషల్ వర్కర్‌గా బ్రతుకుతాను. కాంట్ ఐ!"

"ఎస్! యు కెన్." అర్థం లేకుండా చెప్పాను.

"నా అనుమానం బావ ఇప్పటికే ఏ స్పానిష్ అమ్మాయినో చేసేసుకున్నాడని...."

"స్టాప్ దట్ నాన్సెన్స్! నిన్నెందుకలా నమ్మించాలి మొదట్నుంచీ .."

నా అరుపుకి గీత కదిలింది నిద్రలో!

"ఇది మరీ బాగుంది! చెప్పు అన్న తర్వాత మారకూడదని రూలేం లేదుకదా."

"వై యూ ఆర్ ది మీనెస్ట్ స్లేవ్స్ ఐ టెల్ యూ! మగ పురుగు అనే వాడు మన లైఫ్ లోంచి వెళ్ళిపోగానే ఫిలాసఫీ మాట్లాడుతున్నాం; వాడే జీవితమైనట్లు. పెళ్ళి లేకపోతే బ్రతకలేనట్లు. ఎకనమిక్ ఫ్రీడమ్ వస్తే ఆడబతుకులు మారతాయా! మన బుద్ధులెవరు మారుస్తారు! అబలామాట అన్న ఫూలెవడు! మనకు వద్దనుకునేంత డబ్బుందిగా! మన మెందుకు మగవాళ్ళలా కేర్ ఫ్రీగా లేం!"

కవి ఏం మాట్లాడలేదు. తల మాత్రం ఇంకా వంచేసింది. "నేను నీకంటే మీన్! పన్నెండేళ్ళప్పుడు పాతికేళ్ళ వాడికిచ్చి చేస్తే నీవు నాకు మామయ్య కాదు. ఇక మీదట మొగుడు అని తెల్పుకోలేదు. బొమ్మల పెళ్ళి చేసుకున్నట్లు నన్నొక్కదాన్ని దిలేసి డబ్బు డబ్బంటూ తన అరబ్ కంట్రీస్‌లో తిరుగుతుంటే. పన్నెండుకు తీసుకెళ్ళవ అని అడగడానికి భయం. సంస్కారం. వాడు నా జీవితాన్ని నాశనం చేసినా పర్వాలేదు. ఇదేమిటని మాత్రం అడగకూడదు. విడిపోడు, కలిసి బతకడు. అయినా వాడు నా మొగుడే! మా అమ్మకు నాన్నకు ఇప్పటికీ నేనో పదేళ్ళ పిల్లను. నాకు ఆలోచనలుండవ్. కోరికలు అసలుండవ్. వాళ్ళు బతకమన్నన్నాళ్ళు ఇలా బతకాలి. ఏం జీవితమిది! అయినా నేను నవ్వుతూ ఉండాలట. లేకపోతే కన్నవాళ్ళు శోకపడతారు. ఇవన్నీ వాళ్ళనేవేనే! నా జీవితం గురించి కలలు కనడానికి కూడా హక్కు లేదు నాకు" దాదాపుగా అరిచాను.

కవిత నా నోరు మూసేసింది. "అవన్నీ మాట్లాడొద్దు బిందూ. మనకేం తక్కువ! అనవసరంగా ఎందుకాలోచించాలవన్నీ! పెళ్ళి లేకుండా బ్రతకలేమా! అదీ చూద్దాం! ఈ రోజు నటితవల్ల వచ్చిన ఎమోషన్స్ ఇవన్నీ. నీ మూడ్ చెరిపేశాను" అంటూనే చివర్లో ఆపుకోలేక నన్ను చుట్టేసి వెక్కి వెక్కి ఏడ్చింది. నా కళ్ళలో తడి నాకు తెలుస్తోంది. దాన్నేమని ఓదార్చను! మొదటి సారి చూశాను కవి ఏడుస్తుంటే!

పది నిమిషాలు అలాగే ఉండిపోయాం. హాస్టల్ అంతా నిశ్శబ్దంగా ఉంది. ఒకోసారి ప్రశాంతతలో కూడా కల్లోలం ఉంటుంది.... ఇప్పటిలాగే! లైట్ వేసి టైమ్ చూసింది కవి. పదకొండూ పది.

తన మంచంపైన పడుకుంటూ అంది "రేపు పిక్నిక్ కు వెళ్ళాలా బిందూ!"

"వద్దులే...." అన్నాను అటు తిరుగుతూ.

ఆలోచనలన్నీ అయిపోయాయి. అందుకే మైండ్ బ్లాంక్‌గా ఉంది. కవిత నిద్రపోలేదు గాని ఇంకా ఏడుస్తున్నట్లే ఉంది. ఎందుకేడవాలి! ఏమీ లేదందిగా! నా మాటలు బాధ పెట్టాయేమో!

రేపు పటీ వాళ్ళకు పిక్నిక్ క్యాన్సిల్ చేసినందుకు ఏం చెప్పాలి!

ఆలోచిస్తూనే నిద్రపోయాము.

●

**"Because you have died for ever**
**In a heap of lifeless dogs...!"**

విన్నటిదాకా
దిగంతాలు దద్దరిల్లే నిర్యాణం చేసిన
ఓ అనంత సాగరం
నేడు కేవలం
జ్ఞాపకాల నిశ్శబ్ద తరంగం!
ఎవరో వస్తారని ఎదురు చూడకంటూ
కదనరంగం వీడి ఓ తురగం
స్మశానాన్ని చేరుకుంది!


ఆ రసవద్గీతి ఆగిపోయినా....
ఆ జ్ఞాపకార్థం తూరుపు పొద్దున
ఎవ్వరో వెలిగించిన అఖండ రుధిర జ్యోతి
వెలుగుతూనే వుంటుంది
ప్రతిరోజూ....!

ఆ "తురగం" ఎవరి కోసమై
పోరాడుతూ చివరి శ్వాస విడిచిందో
వారికి....

—వేదం శ్రీనివాస గోపాల్

# వేసవి జాగ్రత్తలు

1. కాఫీ టీ అలవాట్లు వున్నవారు సాధ్యమైనంతవరకు తగ్గించి మజ్జిగ తీసుకోవటం మంచిది
2. బయట ఎండలో తిరిగి తిరిగి వచ్చి మంచినీళ్ళుతాగకూడదు. ఐదునిమిషాల తర్వాత తాగటం మంచిది.
3. మత్తు పానీయాలు త్రాగేవారు మానటం మంచిది. లేదా సాధ్యమైనంతవరకు తగ్గించాలి. వేసవి కాలంలో లిక్కర్ తీసుకోవటం వలన గొంతుక ఎండి ఏదైనా ప్రమాదం జరగవచ్చు.
4. చీటికి మాటికి ముఖం చల్లటి నీళ్ళతో కడగకూడదు. అలా చేస్తే వడదెబ్బ తగులుతుంది.




5. పసిపిల్లలకు సాయంత్రం పూట సోడా నీళ్ళతో వొళ్ళు కడిగితే ఆరోగ్యం.
6. ఎండలో దూరపు ప్రయాణాలు చేసేటప్పుడు ఒక ఉల్లిపాయ దగ్గరుంచుకోవడం మంచిది. (వాసన చూసేందుకు)
7. ఈ కాలంలో నూలు (కాటన్) వస్త్రాలు ధరించటం శ్రేయస్కరం. చెమట పట్టదు.
8. మగవారు ఎక్కువ జుట్టు పెంచుకోక సమ్మర్ క్రాపు చేయించుకోవాలి.

—జె.వి. రమణారావు